సాక్షి అనంతపురం

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ.16 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.16 వేలు పలికాయి.



15 మండలాల్లో వర్షం

బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 15 మండలాల పరిధిలో 5.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది.



జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగుతోంది. ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

కిలో టమాట @ రూ.68



అనంతపురం అగ్రికల్చర్: టమాట ధర దిగొస్తోంది. 20 రోజుల తర్వాత కనిష్ట ధర పలికింది. గత నెల 20 నుంచి కనీవిని ఎరుగని రీతిలో గరిష్ఠ ధరలతో సామాన్యులను బెంబేలెత్తించిన టమాట ధర గురువారం బాగా తగ్గింది. ఒకరోజు వ్యవధిలోనే కిలోపై రూ.20 మేర తగ్గడం విశేషం. మార్కెట్‌కు సరుకు పెరగడం ధర తగ్గుదలకు కారణంగా తెలుస్తోంది. కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ఠ ధర రూ.68 ప్రకారం పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్ ప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 1,800 టన్నుల సరుకు రాగా, బహిరంగ వేలం వేశామన్నారు. అందులో కిలో గరిష్ఠంగా రూ.68, కనిష్ఠంగా రూ.33, సరాసరిన రూ.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయని వెల్లడించారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి తెలిపారు. గురువారం నగరంలోని బీసీ బాలికల వసతి గృహంలో వార్డెన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మెనూలో మార్పులు తీసుకొచ్చిందన్నారు. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్థానికంగా నివాసం ఉండాలని ఆదేశించారు. ప్రతి హాస్టల్‌లో సమాజం, వ్యక్తిగత వికాసంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారిణి సుభాషిణి పాల్గొన్నారు.

నాటక అకాడమీ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతల స్వీకరణ అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ భార్గవ్‌ను కలిసిన ప్రమీల

అనంతపురం కల్చరల్: ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్‌గా శింగనమల మండలం బండమీదపల్లికి చెందిన ప్రమీల గురువారం విజయవాడలో బాధ్యతలు తీసుకున్నారు. నాటక అకాడమీ సీఈఓ మల్‌రెడ్డి ఆమెతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆమె ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ భార్గవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల వారిని పాలనలో భాగస్వామ్యం చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యాసలహాదారు సాంబశివారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 12,13 తేదీల్లో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ప్రకటనలో తెలిపారు. 12న సికింద్రాబాద్ జంక్షన్ నుంచి (07489) రాత్రి 10.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 తిరుపతికి చేరుతుందన్నారు. తిరుపతి జంక్షన్ నుంచి 13వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 4.50 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుందని పేర్కొన్నారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, గద్వాల, రాయచూరు, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా రైలు ప్రయాణిస్తుందని వివరించారు.

ప్రగతి బాట

అభివృద్ధికి ప్రధానమైన మౌలిక వసతుల కల్పనలో ఉమ్మడి అనంత జిల్లా ముందువరసలో ఉంటోంది. పెద్ద పెద్ద నగరాలను అనుసంధానించే జాతీయ రహదారుల మంజూరు, నిర్మాణంలో దూసుకుపోతోంది. ఉమ్మడి జిల్లా ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నింటా ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్టులను మంజూరు చేస్తున్నాయి. మూడురోజుల క్రితం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా వెల్లడించిన నివేదిక ద్వారా ఈ విషయం వెలుగు చూసింది.



- రోడ్డు ప్రాజెక్టుల మంజూరులో ఉమ్మడి అనంతపురం ముందంజ
- రాష్ట్రంలోనే అత్యధికంగా జాతీయ రహదారుల నిర్మాణం ఇక్కడే
- 13 ప్రాజెక్టుల నిర్మాణంతో రెండో స్థానంలో అనంతపురం
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఇప్పటికే 696 హెక్టార్ల భూ సేకరణ
- మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని అంచనా

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లో 167 జాతీయ ప్రాజెక్టులు నిర్మాణమవుతున్నాయి. వీటిల్లో అత్యధికంగా 18 ప్రాజెక్టుల పనులు శ్రీ సత్యసాయి జిల్లాలో సాగుతున్నాయి. రూ.1,300 కోట్లకు పైగా వ్యయం చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో 13 రోడ్డు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. రహదారుల నిర్మాణానికి 'అనంత'లో 616 హెక్టార్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 1,564 హెక్టార్ల భూమిని సేకరిస్తున్నారు.

'శ్రీ సత్యసాయి' దూకుడు..

రహదారుల నిర్మాణంలో శ్రీసత్యసాయి జిల్లా దూసుకెళుతోంది. ఇప్పటికే టోల్‌గేట్‌ల ద్వారా రికార్డు స్థాయిలో వసూలు చేస్తున్న జిల్లా.. ఇప్పుడు అత్యధిక రోడ్డు ప్రాజెక్టులు నిర్మాణం జరుపుకుంటున్న ప్రాంతంగా పేరు గడిస్తోంది. భూ సేకరణలోనూ రెండో స్థానంలో ఉండడం గమనార్హం. మల్బరీ సాగు, ఎంఎస్ఎంఈల ఏర్పాటులో రికార్డు స్థాయి ప్రగతిని 'శ్రీ సత్యసాయి' నమోదు చేసుకున్న విషయం తెలిసిందే.

50 శాతానికి పైగా భూ సేకరణ

శ్రీ సత్యసాయి జిల్లాలో 1,328 హెక్టార్ల ప్రైవేటు భూమి, 236 హెక్టార్ల ప్రభుత్వ భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే 632 హెక్టార్లు సేకరించారు. మరో 696 హెక్టార్లు సేకరించాల్సి ఉందని జాతీయ రహదారుల అథారిటీ అధికారులు పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో 542 హెక్టార్ల ప్రైవేటు భూమి కావాల్సి ఉండగా, 347 హెక్టార్లను సేకరించారు. మరో 195 ఎకరాలు మాత్రమే సేకరించాలి. రెండు జిల్లాల్లో ఈ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది.

మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి

మూడేళ్లలో అన్ని రోడ్డు ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ. 2 వేల కోట్ల వ్యయం చేస్తున్నారు. బెంగళూరు–హైదరాబాద్, బెంగళూరు–విజయవాడ, హిందూపురం, పుట్టపర్తి వంటి ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీతో రోడ్డు ప్రాజెక్టులు చేపడుతున్నారు. కొత్తగా నిర్మించే రోడ్లతో మరో నాలుగైదు టోల్‌గేట్‌లు కూడా వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

రాయలసీమ జిల్లాల్లో జాతీయ రహదారుల ప్రాజెక్టులు ఇలా..

జిల్లా	జాతీయ రోడ్డు ప్రాజెక్టులు	మొత్తం భూమి (హెక్టార్లలో)
అనంతపురం	13	616
అన్నమయ్య	07	639
చిత్తూరు	12	1,827
కర్నూలు	05	108
నంద్యాల	05	676
ప్రకాశం	09	1,374
తిరుపతి	08	820
శ్రీ సత్యసాయి	18	1,564

వేగంగా భూసేకరణ



జాతీయ రహదారులకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూముల సేకరణ ముమ్మరం చేశాం. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు జరుగుతున్నాయి. జాతీయ రహదారు విభాగం అధికారులతో సమన్వయంతో ముందుకెళుతున్నాం.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- కలెక్టర్ గౌతమి



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం క్రైం: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ ఎం. గౌతమి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని అరవిందనగర్‌లోని శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో 'జాతీయ నులిపురుగుల నివారణ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ గౌతమి హాజరై విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలే దేశ సంపద అని అన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను విధిగా పాటించాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలకు హానికరంగా మారే నులిపురుగులను సమూలంగా నిర్మూలించాలన్నారు. ఆరు నెలలకోసారి 1–19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని చెప్పారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ జిల్లాలో 5,64,000 విద్యార్థులకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. మాత్రలు తీసుకోని విద్యార్థులకు ఈ నెల 17న మరోసారి అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఈఓ సాయిరాం, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణవేణి, ఆర్ఐఓ సురేష్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, వైద్యురాలు డాక్టర్ జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చవ్వా రాజశేఖర్ రెడ్డి, హెచ్ఎం శ్యాంసన్, ఎంపీహెచ్ఈఓ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పాలన

- మంత్రి ఉషశ్రీచరణ్
- రూ.2.20 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ భవనాల ప్రారంభం



నూతన ప్రభుత్వ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

కంబదూరు: దేశానికే ఆదర్శంగా నిలిచేలా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. మండలంలోని ఓబగానిపల్లి, కంబదూరు గ్రామాల పరిధిలో రూ.2.20 కోట్లతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, కాన్పుల గదులను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా వైఎస్సార్ హెల్త్ సెంటర్లు, సచివాలయాలు, ఆర్బీకేలను ఏర్పాటు చేశారని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో పల్లెల్లోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేస్తూనే గ్రామాలలో చిరస్థాయిగా నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ తిమ్మరాజమ్మ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్, కన్వీనర్ బాలరాజు, బీసీ, రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, వైస్ ఎంపీపీ బీమేష్, సర్పంచ్‌లు పద్మావతమ్మ, సంధ్య, చంద్రశేఖర్, అమర్, డీఈ రాజన్న, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, ఎంపీటీసీలు మీసేవ కుమార్, మేటి విద్యావతి, ఆకుల గంగప్ప, మల్లేష్, సోమశేఖర్ నాయకులు హరినాథ్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు సర్కారు భరోసా

- నేడు వైఎస్సార్ సున్నా వడ్డీ జమ

అనంతపురం: వైఎస్సార్ సున్నా వడ్డీ జమ కార్యక్రమాన్ని నాలుగో సంవత్సరం కూడా కొనసాగిస్తూ అక్కచెల్లెమ్మలకు భరోసా ఇచ్చేందుకు సర్కారు సిద్ధమైంది. సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు, ఆ సంవత్సరం తీసుకున్న కొత్త రుణాలకు కూడా వడ్డీ నగదు జమ కానుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. జిల్లాలోని 31,868 పొదుపు సంఘాల్లో రూ.42.95 కోట్లు నేరుగా బ్యాంకుల ద్వారా సంఘం అప్పు ఖాతాలకు చెల్లించనున్నారు. సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకునే చిన్న తరహా వ్యాపారాలు మరింత లాభదాయకంగా, వడ్డీ భారం లేకుండా నడపడానికి, మెరుగైన జీవనం సాగించడానికి 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం ఎంతగానో దోహదపడుతోంది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 26,694 సంఘాలకు రూ.56.99 కోట్లు, 2020–21 ఆర్థిక సంవత్సరానికి 31,471 సంఘాలకు రూ.49.23 కోట్లు, 2021–22 ఆర్థిక సంవత్సరానికి 32,441 సంఘాలకు రూ. 53.82 కోట్లు, తాజాగా రూ.42.95 కోట్లు కలిపి మొత్తం రూ.203.00 కోట్ల మేర మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూర్చినట్లవుతోంది.

14న అప్రెంటిస్ షిప్ మేళా

రాప్తాడురూరల్: అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 14న ఉదయం 9 గంటలకు అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.రామమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు పదో తరగతి, ఐటీఐ మార్క్స్ మెమోలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, ఫొటోలు, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్/రేషన్‌కార్డ్, బ్యాంకు పాస్‌బుక్, కులధ్రువీకరణ పత్రం మూడుసెట్లు తీసుకుని హాజరుకావాలని సూచించారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల అధికారులు, యాజమాన్యాలు పాల్గొని వారికి అవసరమైన ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అప్రెంటిస్ షిప్ అవకాశాలు కల్పించాలని ప్రిన్సిపాల్ రామమూర్తి కోరారు.

11న గుంతకల్లు ఐటీఐలో జాబ్‌మేళా

అశోక్‌లేల్యాండ్ కంపెనీలో జూనియర్ టెక్నీషియన్ల ఉద్యోగాల భర్తీకి ఈనెల 11న గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నారని అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటర్ మెకానిక్ కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జీతం నెలకు రూ. 12 వేలు, వసతి కల్పిస్తారన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అశ్రునయనాలతో కిరణ్ అంత్యక్రియలు





పోలీసు లాంఛనాలతో కిరణ్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం (చిత్రంలో) కుమారులు యశ్వంత్, మణిదీప్, అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజలు

ఆత్మకూరు/అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ అంత్యక్రియలు గురువారం ఉదయం ఆయన స్వగ్రామం ఆత్మకూరులో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. శింగనమల మండలం తరిమెలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన భార్య అనితను బస్సు ఎక్కించేందుకు అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో నుంచి ద్విచక్ర వాహనంపై బుధవారం ఉదయం బయలుదేరిన కిరణ్... లారీ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన విషయం తెలిసిందే. గాయపడిన అనిత బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కిరణ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించడంతో గురువారం ఆత్మకూరులో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కిరణ్ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు, ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, కదిరి మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషాతో పాటు రాజకీయ నాయకులు, స్నేహితులు అశ్రునయనాలతో నివాళులర్పించారు. అంతిమ యాత్రలో వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తన కళ్ల ముందే భర్త మలోబన్న, కుమారులు రమేష్, కిరణ్ మృతి చెందడంతో తల్లి అంజినమ్మ రోదనకు అంతు లేకుండా పోయింది. అంత్యక్రియల్లో పాల్గొన్న కిరణ్ కుమారులు యశ్వంత్ నారాయణ, మణిదీప్‌ను చూస్తూ పలువురు కన్నీరు పెట్టారు.



భార్య అనిత, పిల్లలతో కిరణ్ (ఫైల్)

నివాళులర్పించిన ఎస్పీ

సర్వజనాస్పత్రిలో ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ మృతదేహానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇది ఊహించని దుర్ఘటన అని, కిరణ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్, ఆర్ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, తదితరులు ఉన్నారు.

సేవల్లో ఎలాంటి జాప్యం లేదు

అనంతపురం క్రైం: ఏఆర్ పీసీ కిరణ్‌కుమార్, ఆయన భార్య అనితకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అందించిన వైద్య సేవల్లో ఎటువంటి జాప్యం జరగలేదని సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగిదంటూ బంధువులు ఆరోపించడంతో సమగ్ర విచారణకు సూపరింటెండెంట్ ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, సర్జికల్ హెచ్ఓడీ డాక్టర్ రామస్వామి నాయక్, ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మారాం, క్యాజువాలిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ శివకుమార్ విచారణ చేశారు. ఉదయం 8.10కు క్షతగాత్రులు వచ్చిన వెంటనే వైద్యులకు సమాచారం అందించి, రక్తస్రావం ఆపేందుకు ఇంజెక్షన్స్ వేయడంతో పాటు ఐవీ ఫ్లూయిడ్స్ అందించామని సీఎంఓ డాక్టర్ జనార్ధన్ నాయక్ పేర్కొన్నారు. ఏఆర్ పీసీ కిరణ్‌కుమార్ పరిస్థితిని వివరించడంతో ఆయన బంధువైన ఓ మహిళ కళ్లు తిరిగి పడిపోయారని ఆర్థో పీజీ డాక్టర్ చియాన్ తెలిపారు. ఈ క్రమంలోనే వారి కుటుంబ సభ్యులు భయాందోళనకు లోనై, హుటాహుటిన బెంగళూరుకు వెళ్తున్నట్లు తెలియజేశారన్నారు. ఉదయం 8.45 గంటలకు ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా తీసుకెళ్లారని వివరించారు. విచారణ కమిటీ నివేదిక ప్రకారం వైద్య సేవల్లో ఎలాంటి జాప్యం జరగలేదని సూపరింటెండెంట్ వెల్లడించారు.

ప్రమాదాలకు బ్లాక్ స్పాట్స్

- రక్తమోడుతున్న రహదారులు
- జిల్లా వ్యాప్తంగా 39 డేంజర్ జోన్‌లు
- నివారణ చర్యలు చేపట్టడంలో అధికారుల విఫలం
- నెలకు నగటున 30 మందికి పైగా మృత్యువాత
- కుటుంబసభ్యులను కోల్పోయిన బాధితుల పరిస్థితి వర్ణనాతీతం



వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఇస్కాన్ సమీపంలోని బ్రిడ్జి వద్ద బ్యారికేడ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని ఇస్కాన్ సమీపంలో నేషనల్ పార్కు బ్రిడ్జి వద్ద వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుని ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మరెందరో వైకల్యం బారిన పడ్డారు. గతంలో ఏకంగా ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సైతం ఇదే ప్రాంతంలో బోల్తా పడింది. అదృష్టవశాత్తు ప్రయాణికులందరూ చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం రాలేదు. ఇంత కాలం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మాత్రమే యూటర్న్ తీసుకోకుండా డివైడర్లు అడ్డు పెట్టి ఆ తర్వాత వాటిని ఎత్తేస్తూ వచ్చారు. జిల్లా పరిధిలో ఇలాంటి ప్రాంతాలు దాదాపు 39 ఉన్నాయి. ఈ ప్రాంతాలను అధికారులు బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించారు. కానీ అక్కడ పెద్దగా ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ఒకే ప్రదేశంలో చోటు చేసుకున్న ఘోర ప్రమాదాలు..

- నేషనల్ పార్క్‌లోని శిల్పారామంలో 2018, మే 16న ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న అనంతపురం నగర పాలక సంస్థలో మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి.. బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే లారీ ఢీకొంది. ఘటనలో కృష్ణమూర్తి మృతి చెందారు. మరో అధికారి తీవ్ర గాయాలతో బయటపడ్డారు.
- నగర పాలక సంస్థలో ఎంహెచ్‌ఓగా పనిచేస్తూ బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లిన డాక్టర్ రాజేష్ సైతం ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. 2021, సెప్టెంబర్ 9న ఈ ఘటన చోటు చేసుకుంది. కరోనా సమయంలో అనేక మంది ప్రాణాలు కాపాడిన వైద్యుడి మృతితో జిల్లా వాసులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.
- ఈ నెల 9న ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తన భార్య అనితను బస్సు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై పిలుచుకెళుతున్న ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌ను లారీ ఢీకొంది. ఘటనలో అతని రెండు కాళ్లు ఛిద్రమయ్యాయి. చికిత్స అందుకుంటూనే ఆయన మృతి చెందారు. కిరణ్ భార్య బెంగళూరులో చికిత్స పొందుతోంది.

బాధితుల పరిస్థితి వర్ణనాతీతం

రోడ్డు ప్రమాదాల్లో కుటుంబసభ్యుణ్ని కోల్పోతే మిగిలిన వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో మాటల్లో చెప్పలేని పరిస్థితి. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన వారు కొందరైతే... చేదోడు వాదోడుగా ఉంటారనుకున్న సమయంలో విగత జీవులుగా మారిన కుమారులను చూసి తల్లడిల్లిపోయిన వారు మరెందరో ఉన్నారు. రహదారుల నిర్మాణ సమయంలో ఇంజినీరింగ్ వైఫల్యం.. రోడ్డు నిబంధనలపై అవగాహన లేకపోవడం... వేగానికి తగినట్లుగా రహదారుల నిర్వహణ లేకపోవడం వెరసి రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాతైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ వస్తున్నారు.

గడిచిన మూడు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు

నెల	ప్రమాదాల సంఖ్య	మృతుల సంఖ్య	క్షత గాత్రులు
ఏప్రిల్	61	39	57
మే	55	35	94
జూన్	51	38	41
మొత్తం	167	112	192

ఎన్‌ఫోర్సుమెంట్‌ను బలోపేతం చేస్తాం

రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా చివరి శనివారం రోడ్డు సేఫ్టీ సమావేశం నిర్వహించి జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలపై సమీక్షిస్తున్నాం. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కళాశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నాం. ఎన్‌ఫోర్సుమెంట్‌ను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్, అనంతపురం

క్లుప్తంగా

'సజ్జల'తో ఎమ్మెల్సీలు భేటీ



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పీఆర్టీయూ విష్ణువర్ధన్‌రెడ్డి

రాప్తాడు రూరల్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలంటూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఎమ్మెల్సీలు టి.కల్పలతారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు, పీఆర్టీయూ అనంతపురం జిల్లా ప్రధానకార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి విన్నవించారు. గురువారం విజయవాడలో వారు సజ్జలతో కలసి పలు అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అనుసరిస్తున్న వైఖరి, ఫెషియల్ అటెండెన్స్ యాప్‌లోని సాంకేతిక లోపాల వల్ల టీచర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఉమ్మడి సర్వీసెస్ రూల్స్ అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటికి సజ్జల సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీలు తెలిపారు.

డీసెట్ సెకెండ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

పుట్టపర్తి: బుక్కపట్నంలోని డీఈడీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి సెకెండ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ పేర్కొన్నారు. ఇంటర్‌లో 40 శాతం మార్కులు సాధించినవారికి వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోవడానికి అవకాశం ఇచ్చారన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల మార్పుకు కూడా అవకాశం ఉందన్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకూ కళాశాల సెలెక్షన్ కోసం ఆప్షన్లను ఇచ్చుకోవచ్చని పేర్కొన్నారు. 14 నుంచి 16 వరకూ సీట్ కేటాయింపులు, 17న కేటాయింపు సీట్ల వివరాల ప్రచురణ, 17 నుంచి 20 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తామన్నారు. 25 నుంచి విద్యార్థులు కళాశాల తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. డీసెట్ రాసి అర్హత కలిగిన విద్యార్థులందరూ వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం



హనుమంతు మృతదేహం

రాయదుర్గం టౌన్: స్థానిక బళ్లారి రోడ్డులోని శాంతినగర్ వద్ద రైలు పట్టాలపై గురువారం ఉదయం 11 గంటలకు ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని రాయదుర్గంలోని వాల్మీకినగర్‌కు చెందిన గార్మెంట్స్ పరిశ్రమ కార్మికుడు హనుమంతు (30)గా గుర్తించారు. ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కాగా, హనుమంతుకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ సమస్యలు తాళలేక మద్యానికి బానిసైన హనుమంతు జీవితంపై విరక్తితోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని బంధువులు తెలిపారు. ఘటనపై గుంతకల్లు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు దుర్మరణం

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ రైతు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యానదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లికి చెందిన హరిజన నాగరాజు (50)కు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం ఉదయం వ్యక్తిగత పనిపై కళ్యాణదుర్గానికి వచ్చిన ఆయన పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గంమధ్యలో గూబనపల్లి వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో వాహనం అదుపు తప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గిడ్డంగిలో చోరీ

విడపనకల్లు: మండలంలోని డోనేకల్ శివారులో ఉన్న దుర్గాంబ ఫార్మర్స్ వేర్‌హౌస్‌లో బుధవారం రాత్రి దుండగులు చొరబడి రూ.3 లక్షల విలువైన పరికరాలను అపహరించుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఉరవకొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ డొనేకల్ రమేష్ గురువారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆఫీస్ రూమ్ తాళాలు బద్ధలుగొట్టి కుట్టు మిషన్, క్యాష్ కౌంటింగ్ మిషన్, కాటా మిషన్, కంప్యూటర్, ఇన్వర్టర్, యుపీఎస్, 5, 10 కేజీల కాటా మిషన్లు 4, ఎక్సైడ్ బ్యాటరీ, జిరాక్స్ మిషన్, కంప్యూటర్, ఫ్యాన్ తదితర సామగ్రి అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

హిజ్రా దౌర్జన్యంపై ఫిర్యాదు

బ్రహ్మసముద్రం: మండలంలోని గరుడాపురం వద్ద దారి మీద వేచి భిక్షమెత్తుకుంటున్న ఓ హిజ్రా అటుగా వెళుతున్న ప్రయాణికుడి నుంచి రూ.5వేలు లాక్కొని ఉడాయించింది. శెట్టూరు మండలం మాకోడికి గ్రామానికి చెందిన యల్లప్ప అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యని పిలుచుకుని గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి బయలుదేరాడు. గరుడాపురం వద్దకు చేరుకోగానే హిజ్రాలు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఓ హిజ్రాకు యల్లప్ప భార్య రూ.10 ఇచ్చింది. అప్పటికే మరో హిజ్రా చనువుగా యల్లప్ప జేబులో చేయి పెట్టి రూ.5వేలు లాక్కొని అక్కడి నుంచి ఉడాయించింది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మార్చికి బీటీపీ పరిధిలోని చెరువులకు నీరు

- మాజీ ఎమ్మెల్యేవిశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న వై.విశ్వేశ్వరరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

బెళుగుప్ప: జీడిపల్లి రిజర్వాయర్ నుంచి గుమ్మఘట్ట మండలం బీటీ ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రక్రియ వేగవంతమైందని, త్వరలో బీటీపీ దిగువన ఉన్న చెరువులను కృష్ణా జలాలతో పూర్తి స్థాయిలో నింపుతామని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఆరో డివిజన్ ఈఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. గురువారం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి ఉరవకొండ మండలం కోనాపురం, దుద్దేకుంట, గంగవరం, శీర్పి గ్రామాల మీదుగా బీటీపీకి ఏర్పాటు చేసిన కాలువ రూట్ మ్యాప్‌ను డీఈ వెంకటరమణ, ఏఈఈలు మల్లికార్జున రెడ్డి, మహేష్‌నాయుడు, సుదర్శన్, మునీరుద్దీన్‌తో కలసి మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. అనంతరం కోనాపురంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఏడాది మార్చిలోపు నీటిని అందించి ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని పేర్కొన్నారు. కోనాపురం, గంగవరం, హనిమరెడ్డిపల్లి చెరువులకు హంద్రీనీవా నీటిని అందిస్తామన్న మాటను ఆచరణ సాధ్యం చేస్తున్నామన్నారు. బీటీ ప్రాజెక్టుకు సంబంధించి కాలువ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.208 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారాన్ని ఆయా రైతులు బ్యాంక్ ఖాతాలకు జమ చేయనున్నట్లు వివరించారు. హంద్రీ-నీవా 36వ ప్యాకేజీ పనులు చేపట్టి శ్రీరంగాపురం, బ్రాహ్మణపల్లి చెరువులకు సైతం నీటిని అందించే విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వను స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, బెళుగుప్ప, ఆవులెన్న సహకార సంఘాల అధ్యక్షులు శివలింగప్ప, శ్రీనివాసులు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, ఎంపీటీసీలు ప్రసాద్, నాగరత్నమ్మ, మండల నాయకులు త్రిలోక్‌రెడ్డి, గోపాల్, మచ్చన్న, బాబు, అశోక్, శంకర్‌రెడ్డి, సూర్యనారాయణ, కృష్ణా, పెద్దన్న, తాతెప్ప, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా



మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా

గుంతకల్లుటౌన్: ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా సూచించారు. గుంతకల్లులోని హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్, కూల్‌డ్రింక్స్ తదితర ఆహార సంబంధ వ్యాపారస్తులకు బేసిక్ కేటరింగ్ అండ్ కోవిడ్ కోర్సుపై కాయ్ వంజీబాబా గ్రామీణ వికాస్ మండల్ (కేవీజీవీఎం) ఆధ్వర్యంలో గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మండీ బజార్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా మాట్లాడుతూ.. ఆహార సంబంధ వ్యాపారాలు చేసే ప్రతి ఒక్కరూ ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికేట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వంట మాస్టార్లు, సర్వర్లు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ యశోదాదేవి, నిర్వాహకులు సింధూ, మోహన్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

అనంతపురం రూరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లకు జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసిందని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ తెలిపారు. 33 చోట్ల వార్డు సభ్యులకు, 2 చోట్ల సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయన్నారు. 33 వార్డు మెంబర్ల స్థానాలకు 77 నామినేషన్లు, రెండు పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 5 నామినేషన్లు దాఖలయ్యాయని డీపీఓ తెలిపారు.

మహిళలకు రక్షణగా ఆపరేషన్ 'మేరీ సహేలి'



ప్రయాణికురాలితో ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్న 'మేరీ సహేలి' టీం సభ్యులు

గుంతకల్లు: మహిళా ప్రయాణికుల రక్షణ, భద్రత కోసం రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఆపరేషన్ మేరీ సహేలి సత్ఫలితాలను ఇస్తోందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆపరేషన్ మేరీ సహేలిపై ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి కల్పించాలనే లక్ష్యంతో గత ఏడాది అక్టోబర్ 20న ఆపరేషన్ మేరీ సహేలి కార్యక్రమాన్ని మహిళా ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మహిళా ప్రయాణాలకు వివిధ అంశాలలో ఎలా సాయపడాలో అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నాయకత్వంలో ఇద్దరి నుంచి 24 మంది సభ్యులతో కూడిన బృందాలు ఇందులో పాల్గొంటున్నాయి. గుంతకల్లు డివిజన్ పరిధిలోని నాలుగు ప్రధాన రైల్వే స్టేషన్లలో ఈ టీమ్ ఏర్పాటు చేసి ఆయా స్టేషన్ల నుంచి రైళ్లలో మేరీ సహేలి టీమ్‌లు గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ప్రయాణ సమయంలో మహిళా ప్రయాణికులకు రైలు ఎక్కడం, దిగడంపై సాయపడడం, ప్రయాణంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, మహిళలకు వారి హక్కులపై చైతన్య పరచడం, అందుబాటులో ఉన్న సహాయక విధానాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నప్పుడు వెంటనే స్పందించడంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకూ గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా దాదాపు 1,820 రైళ్లలో గస్తీ నిర్వహించిన బృందం సభ్యులు దాదాపు 322 మంది ప్రయాణికులకు సత్వర సాయం అందించారు. అలాగే 1,116 మంది మహిళా ప్రయాణికుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కారకులైన ఆపరేషన్ మేరీ సహేలి సభ్యులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

పంటలు నమోదు చేయించండి



పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

శింగనమల: సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం బుక్కరాయసముద్రం మండలంలోని కొండాపురం గ్రామంలో పంటల నమోదును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల నమోదుతో బీమా, నష్ట పరిహారం అందుకునేందుకు వీలుంటుందన్నారు. రైతులు తప్పకుండా ఆర్బీకేలకు వెళ్లి పంట నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ రవి, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది తిరుమలేష్ పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

బుక్కరాయసముద్రం: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. పుంగనూరు ఘటనలో టీడీపీ గూండాలను రెచ్చగొట్టి పోలీసులపైకి ఉసిగొల్పిన చంద్రబాబుపై కేసు నమోదు చేయకుండా ఆస్కార్ అవార్డులేమీ ఇవ్వరని ఎద్దేవా చేశారు. బీకేఎస్‌లోని సహకార సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి దక్కిన ప్రజాదరణను చూసి ఓర్వలేక చంద్రబాబుకు పిచ్చి ముదిరిపోయిందన్నారు. దీంతో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. పుంగనూరు ఘటనలో ఎంతో మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. కొందరికి కళ్లు, కాళ్లు కూడా పోయాయన్నారు. ఘటనకు సంబంధించి చంద్రబాబుతో పాటు టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. దీనిని వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే మరో నాటకానికి చంద్రబాబు తెరలేపడం సిగ్గుచేటన్నారు. పోలీసులు పెట్టిన కేసులన్నీ సక్రమమే అన్నారు. తప్పు చేస్తే చట్టానికి అందరూ సమానమే అన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాజారాం, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్ పార్వతి పాల్గొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్ దగ్గర ఓ ప్రేమజంట గురువారం సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొమ్మనహాళ్‌కు చెందిన యువకుడు, కణేకల్లు మండలంలోని పులచెర్ల గ్రామానికి చెందిన యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో ఇరుకుటుంబాల వారు వీరి పెళ్లికి అంగీకరించలేదు. దీంతో మనస్తాపం చెందిన ప్రేమికులు ఆత్మహత్య చేసుకోవాలని పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని గమనించిన స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.

నేటి నుంచి రాయలసీమ కింగ్స్ శిక్షణ శిబిరం



విహారికి స్వాగతం పలుకుతున్న జట్టు సభ్యులు

అనంతపురం: ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2 నేపథ్యంలో రాయలసీమ కింగ్స్ జట్టుకు అనంత క్రీడాగ్రామం వేదికగా మూడు రోజుల పాటు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్, రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమవిహారి గురువారం అనంత క్రీడాగ్రామానికి చేరుకున్నారు. ఆయన జట్టు సభ్యులు ఘన స్వాగతం పలికారు. 'తిప్పరా మీసం' అనే నినాదంతో ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో బరిలో రాయలసీమ కింగ్స్ జట్టు దిగనుంది. రాయలసీమ కింగ్స్ జట్టు వైస్ కెప్టెన్ పి.గిరినాథరెడ్డి, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడు హరిశంకర్‌రెడ్డి, రంజీ ట్రోఫీ ఆటగాడు అభిషేక్ రెడ్డి, వంశీ కృష్ణ, కోగటం. హెచ్.వీరారెడ్డి, రాజు కుళ్లాయప్ప, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, శుక్రవారం అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో 'తిప్పరా మీసం' కార్యక్రమాన్ని హనుమవిహారి ప్రారంభించనున్నారు. రాయలసీమ కింగ్స్ జెర్సీని ఆవిష్కరిస్తారు.

అనంత నుంచి దేశవ్యాప్తంగా చీనీ ఎగుమతులు

- మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్
- ఆర్జేడీ, డీడీ, ఏడీతో కలసి మార్కెట్‌ను పరిశీలించిన చైర్మన్

అనంతపురం అగ్రికల్చర్: నాణ్యమైన చీనీ ఉత్పత్తులు అత్యధికంగా అనంతపురం జిల్లా నుంచే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ అన్నారు. మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డితో కలసి గురువారం చీనీ మార్కెట్‌లో క్రయవిక్రయాలను ఆయన పరిశీలించారు. మార్కెటింగ్, ఇతర అంశాలను రైతులు, ట్రేడర్లను అడిగి తెలుసుకున్నారు. ఫయాజ్ మాట్లాడుతూ.. ఏటా లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఇక్కడ చీనీ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అందులో 90 శాతం ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ లాంటి మార్కెట్లకు ఎగుమతి అవుతోందని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున చీనీ విక్రయాలు, ఎగుమతి మరెక్కడా జరగడం లేదని గుర్తు చేశారు. ఏడాది పొడవునా మార్కెట్‌లో క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవడంతో రైతులకు మేలు జరుగుతోందన్నారు. చీనీ రైతులకు ఉపయోగపడేలా మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, వ్యాపారుల్లో పోటీని పెంచి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టినట్లు సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా 'నాభూమి-నాదేశం'



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి, మన్నీల, చియ్యేడు, ఆలమూరు, తాటిచెర్ల, కట్టకిందపల్లి, అక్కంపల్లి, కాటిగానికాలువ, కక్కలపల్లి, కక్కలపల్లికాలనీ పంచాయతీల్లో 'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో భాగంగా గురువారం 'నాభూమి-నాదేశం' కార్యక్రమం నిర్వహించారు. కక్కలపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

ఆత్మకూరు: మొక్కలు నాటి వాటిని సంరక్షిద్దామని వైస్ ఎంపీపీ నీలిమ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న తెలిపారు. గురువారం సింగంపల్లి, సిద్ధరాంపురం, పి.యాలేరు గ్రామాల్లో నా భూమి - నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పి.యాలేరు సర్పంచ్ ఆరోగ్యం రెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణే ధ్యేయం



స్పెషల్ ఆఫీసర్ శిరిన్‌బేగంకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని వక్ఫ్‌బోర్డు చైర్మన్లు అన్నారు. గురువారం విజయవాడలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ల సమావేశం జరిగింది. సమావేశంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ 19 ఏళ్లగా వక్ఫ్‌బోర్డు కమిటీలు లేవన్నారు. తొలిసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా కోరారు.

పారదర్శకంగా జాబితా తయారు చేయండి



ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న అధికారులు

రాప్తాడు: ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. గురువారం మండలంలోని హంపాపురం, రామినేపల్లి గ్రామాల్లో ఓటర్ల జాబితాపై హౌస్ టూ హౌస్‌పై చేస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కొత్త ఓటరు జాబితాలతో ఈనెల 21 వరకు ప్రతి ఇంటికీ బీఎల్‌ఓలు వెళ్లి, ఓటర్ల పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటి పేర్లు తదితర వివరాలు జాబితాలో సరిగా ఉన్నవీ లేనిదీ సరి చూసుకోవాలన్నారు. ఈ సర్వేలో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



వేడుకలను ప్రారంభిస్తున్న సీఐ రెడ్డప్ప

రాప్తాడురూరల్: అనంతపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా జరిపారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి, వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐ రెడ్డప్ప మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఓర్పు నేర్పులతో ప్రయోజిత విద్యను అభ్యసించి, మానవ విలువలతో సంపూర్ణ వికాసం చెందాలని కోరారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణ, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ, కోడీన్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

రంగప్రవేశంతో ఆకట్టుకున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: శ్రీనృత్యకళానిలయం సంధ్యామూర్తి శిష్యబృందం గురువారం రాత్రి అరంగేట్రంతోనే అద్భుత అభినయంతో ఆకట్టుకున్నారు. నగరంలోని శివకోటి మందిర కళా ప్రాంగణంలో రంగపూజ కార్యక్రమం నిర్వహించారు. 11 మంది చిన్నారులు అన్నమయ్య, త్యాగయ్య, పురందరదాస సంకీర్తనలపై శాస్త్రీయ నృత్యాలతో అందరినీ ఆకట్టుకున్నారు. శివకోటి వ్యవస్థాపకుడు శివయ్య స్వామి, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు చిన్నారులకు జ్ఞాపికలు అందించారు.

బ్లాక్ స్పాట్లుగా గుర్తించండి

రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించాలని పోలీస్ అధికారులను డీఐజీ అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ దంపతులకు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని అనంతపురం రేంజ్ డీఐజీ, జిల్లా ఎస్పీ గురువారం సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై వారు ఆరా తీశారు. వేగనియంత్రణకు ఆ ప్రాంతంలోని రోడ్డుకు అటు ఇటు వాహన రాకపోకలు లేకుండా ఐరన్ బారికేడ్లతో మూయించాలని ఆదేశించారు. కాషన్ రోడ్లు, రంబుల్ స్ట్రిప్స్, క్యాట్ ఐస్, లైటింగ్ ఏర్పాటు చేయించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించాలని సూచించారు. ఇంజనీర్లు, త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్, ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

– అనంతపురం శ్రీకంఠంసర్కిల్:



ఇస్కాన్ టెంపుల్ సమీపాన నేషనల్ హైవేలో ప్రమాదం జరిగే ప్రదేశం



ప్రమాదాలు చోటుచేసుకునే ప్రదేశంలో పోలీస్ సిబ్బంది



అడ్డదిడ్డంగా వెళ్తున్న టిప్పర్



ప్రమాద స్పాట్‌ను పరిశీలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు, నేషనల్ హైవే అధికారులు

సమస్యలు గుర్తించేందుకే మసీదుల సందర్శన

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మైనార్టీల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతను వివరిస్తూ, సమస్యలు గుర్తించేందుకే మసీదులను సందర్శిస్తున్నట్లు మేయర్ వసీం తెలిపారు. గురువారం 'హర్ దిల్ మేవైఎస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమంలో భాగంగా గుత్తిరోడ్డు మసీద్ ఏ ఆక్సలో మసీదులో ముస్లిం పెద్దల సమావేశం జరిగింది. నగర మేయర్ వసీంతో పాటు మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్ తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. ముస్లిం మైనార్టీలకు మేలు జరిగిందంటే అది దివంగత రాజశేఖరరెడ్డి, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాత్రమేనన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, మసీదు ముతవల్లి షేక్షా, ఇమామ్ జబ్బార్‌సాబ్ పాల్గొన్నారు.



మసీదులో ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న మేయర్ వసీం

పూడికతీత పనులు వేగవంతంగా చేయాలి

అనంతపురం క్రైం: పూడికతీత పనులను వేగవంతం చేయాలని మేయర్ వసీం ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. గురువారం సప్తగిరి సర్కిల్ వద్ద జరుగుతున్న పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. ఎప్పటికప్పుడు పనులను పారిశుధ్య కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. ప్రజలు సైతం కాలువల్లో చెత్తాచెదారం పారేయకూడదన్నారు. నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న క్లాప్ ఆటోలు, పుష్‌కాట్లు, తదితర వాహనాలకు అందించాలన్నారు.ఎంహెచ్‌ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా, మెహరాజ్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం

అనంతపురం సిటీ: ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళలు ఉధృతం చేస్తామని తపాలా ఉద్యోగులు నినదించారు. గురువారం అనంతపురం డివిజనల్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేశారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ), నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ (ఎన్‌యూజీడీఎస్) సంయుక్త పిలుపు మేరకు జిల్లా నలుమూలల నుంచి గ్రామీణ తపాలా ఉద్యోగులు భారీగా తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. వారినుద్దేశించి ఏఐజీడీఎస్‌యూ డివిజనల్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, యూనియన్ ప్రతినిధులు సలీమా బేగం, రాజ్యలక్ష్మి, అరుణ, లక్ష్మీదేవి, నజీమున్నీసా, శ్రీరాములు, రామాంజనేయులు, నబీసాబ్, గోపాల్, నాగేశ్వరరావు, సూర్యనారాయణరెడ్డి, శంకర్ తదితరులు మాట్లాడారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహాధర్నా కొనసాగింది.



అనంతపురంలో మహాధర్నా నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

నులిపురుగుల నివారణతో రక్తహీనత దూరం

రాప్తాడు: నులిపురుగుల నివారణతో రక్తహీనతను దూరమవుతుందని వైద్యాధికారులు శ్రావణి, శివకృష్ణ తెలిపారు. గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణ, లక్ష్మీ నరసమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడు: చిన్మయనగర్‌లో చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో, కళాశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాలు వయసులోపు ఉన్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు గురువారం పంపిణీ చేశారు.ఆత్మకూరు కేజీబీవీలో వైద్యాధికారి దయాకర్, సర్పంచ్ వరలక్ష్మి చేతుల మీదుగా మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 7,879 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఎస్‌ఓ లీమారోజ్, ఎంపీహెచ్‌ఓ నాగేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మారకపోతే.. మార్చేస్తాం

- ఏఓలకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ క్లాస్

అనంతపురం సిటీ: పనితీరు మెరుగుపర్చుకోకపోతే చర్యలు తప్పవని జెడ్పీ ఉద్యోగులకు చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ క్లాస్ పీకారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేసే కొందరు ఉద్యోగుల పనితీరుపై ఆరోపణలు, విమర్శలు వస్తున్న నేపథ్యంలో జెడ్పీచైర్‌పర్సన్.. గురువారం జెడ్పీలోని అన్ని సెక్షన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నపళంగా జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయంలోని అన్ని విభాగాల్లో కలియతిరిగారు. అయితే జెడ్పీచైర్‌పర్సన్ తనిఖీ చేసిన సమయంలో ఆయా విభాగాల్లో ఉద్యోగులు లేరు. ఒక్క పీఎఫ్ విభాగంలో ఉద్యోగులు తప్ప.. మిగిలిన విభాగాల్లో ఖాళీ కుర్చీలు కనిపించాయి. ప్రధాన ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో ఒకే ఒక ఉద్యోగిని మాత్రమే కనిపించారు. అనంతరం అన్ని విభాగాల ఏఓలను తన చాంబర్‌కు పిలిపించి, అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఏ సెక్షన్ ఉద్యోగి విధులకు రాకపోయినా పూర్తిగా ఆ సెక్షన్ ఏఓనే బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. కార్యాలయ పని వేళల్లో హోటళ్ల వద్ద, బయట బజారులో ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఎవరెక్కడ తిరుగుతున్నారో తన వద్ద పూర్తి సమాచారం ఉందని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని మందలించారు. ఏఓలు ఉషాకుమారి (హెచ్), రవిప్రసాద్ (ఐ), తిప్పయ్య (డి), శ్రీనివాసులు(జి), విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి(సి), నాగేంద్ర(ఏ) పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

విశ్వవిద్యాలయాలకు స్కాలర్‌షిప్ వర్తింపజేయాలి

రాప్తాడురూరల్: ఉన్నత విద్యా రంగంలో పరిశోధనలకు సంబంధించి రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు కూడా స్కాలర్‌షిప్ వర్తింపజేయాలని అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం విద్యార్థులు డిగ్రీ, ఇతరత్రా ఉన్నత చదువుల్లో ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నా పరీక్షలను తెలుగు మాధ్యమంలో రాయడానికి అవకాశం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల అధ్యాపకుల నియామక ప్రక్రియలో పరిశోధన డిగ్రీ పొందిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. విశ్వవిద్యాలయాల రీజినల్ సెంటర్స్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి, డాక్టర్ గంగినేని రంగనాథ్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్ కుమార్, బాలాజీ, మహేంద్ర చౌదరి ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సెబ్ సిబ్బందిని సస్పెండ్ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: గిరిజన ప్రజాప్రతినిధి అయిన నగర 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్‌ను సెబ్ సిబ్బంది అగౌరవ పర్చడం దారుణమని, వారిని వెంటనే సస్పెండ్ చేయాలని మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాజునాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. నవోదయ కాలనీకి చెందిన గిరిజన యువకుడిని అక్రమంగా సెబ్ అధికారులు అరెస్టు చేసి, అతనిపై దాడి చేశారని కార్పొరేటర్ చంద్రశేఖర్ అధికారులను అడగడానికి వెళ్తే.. ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా అగౌరపరచడం సరికాదన్నారు. వెంటనే అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ, చిరంజీవి, శివశంకర్ నాయక్, గోవిందు, ముసలయ్య, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

పారని 'ప్రభాకరుడి' పాచిక

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై పచ్చమీడియాను ఉసిగొలిపి బురదజల్లాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర చౌదరి వేసిన పాచిక పారలేదు. సెబ్‌పోలీసులు వైఎస్ఆర్‌సీపీ కార్పొరేటర్లపై అనుచితంగా వ్యవహరించిన వీడియోలు బయటకు వచ్చి వైరల్ కావడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు కూడా తమ సిబ్బందిని మందలించి, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏమిటో గుర్తుచేశారు. ఇది మింగుడుపడని వైకుంఠం ప్రభాకరచౌదరి ఎలాగైనా ఈ వివాదాన్ని తనకు అనుకూలంగా మల్చుకొని రాజకీయం చేయాలని యత్నించారు. అందులో భాగంగా వైకుంఠం తన బ్యాచ్‌ను రంగంలోకి దింపి సెబ్ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన చేయించారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయించారు. కాగా అప్పటికే సోషల్ మీడియాలో పచ్చపత్రికలు చేస్తున్న తప్పుడు సమాచారాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేయించి, వైఎస్సార్‌సీపీ నేతలకు మసిపూయాలని చూశారు. అసలైన వీడియోలు నెట్టింట ఒక్కొక్కటి బయటకు రావడంతో అసలు రంగు బయటపడింది. దీని వెనుక టీడీపీ నేత వైకుంఠం ప్రభాకరచౌదరి కుట్ర స్పష్టంగా అనంతవాసులకు అర్థమైంది.

వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

- వార్డు మెంబర్ ఎన్నికకు నాలుగు నామినేషన్లు

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామ పంచాయతీలోని రెండో వార్డు (బీసీ జనరల్)కు ఈ నెల 19న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి దామోదర్‌రెడ్డి గురువారం సాయంత్రం తెలిపారు. ప్రసన్నాయపల్లి 2వ వార్డు మెంబర్ సాకే కృష్ణమూర్తి అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందారు. ఈ రెండో వార్డు మెంబర్ ఎన్నిక కోసం ఈ నెల 6న ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. గురువారం నామినేషన్ వేయడానికి ఆఖరి రోజు కావడంతో వైఎస్సార్ సీపీ మద్దతురాలు సాకే ఆదిలక్ష్మీ రెండు సెట్లు, మరొక వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు వెల్పుల శ్రావణ్ కుమార్ ఒక సెట్టు దాఖలు చేశారు. టీడీపీ మద్దతుదారుడు వెంకటేశులు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 11న స్క్రూటినీ, 12న అప్పీళ్లు, 13న డిస్పోజల్, 14న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, ఆతర్వాత అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి 1 గంట వరకు పోలింగ్, అదే రోజు గెలుపొందినవారి వివరాలు ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు వేల్పుల రాజశేఖర్, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమణా రెడ్డి, శివారెడ్డి, బోయ మనోహర్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడులో నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతురాలు సాకే ఆదిలక్ష్మి

13వ వార్డుకు నాలుగు నామినేషన్లు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీలో ఖాళీపడిన 13వ వార్డు ఎన్నిక కోసం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాధవికి నామినేషన్లు అందించారు. శుక్రవారం స్క్రూటినీ ఉంటుంది. ఈనెల 14 వరకు ఉప సంహరణ గడువు ఉందని ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు.

ఆకుతోటపల్లి ఉప సర్పంచ్ రాజీనామా



రాజీనామా లేఖను ఎంపీడీఓ పుల్లయ్యకు అందజేస్తున్న వీణ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి పంచాయతీ ఉప సర్పంచ్ డి.వీణ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఎంపీడీఓ పుల్లయ్యకు గురువారం అందజేశారు. 5వ వార్డు మెంబరుగా గెలుపొందిన వీణ ఉపసర్పంచ్‌గా ఉన్నారు. వ్యక్తిగత కారణాలతో ఉప సర్పంచ్ పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు వీణ తెలిపారు. వార్డు మెంబరుగా కొనసాగుతానని స్పష్టం చేశారు.

ముగ్గురు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడడంతో ముగ్గురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. గుత్తి, పామిడి, ధర్మవరంలో ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు పట్టుబడినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరు బీఎల్‌ఓల సస్పెండ్

- ఇంటింటి సర్వే నిర్లక్ష్యంపై కలెక్టర్ గౌతమి సీరియస్

అనంతపురం అర్బన్: నగరంలో ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వేను సక్రమంగా నిర్వహించని ఇద్దరు బీఎల్‌ఓలపై (బూత్ లెవల్ ఆఫీసర్) కలెక్టర్ ఎం.గౌతమి చర్యలు తీసుకున్నారు. వారిద్దరినీ సస్పెండ్ చేయాలని ఆర్‌డీఎంఏను ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ మొదటి నుంచి కచ్చితమైన ఆదేశాలిస్తున్నారు. అయితే అనంతపురం అర్బన్ నియోజకవర్గం పరిధిలోని 77 పోలింగ్ బూత్ బీఎల్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి డి.లోకేశ్, 182 పోలిగ్ బూత్ బీఎల్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న వార్డ్ ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శి రమేశ్ జక్కల ఇంటింటి సర్వేలో అవకతవకలు పాల్పడినట్లు ఈఆర్‌ఓగా వ్యవహరిస్తున్న ఆర్డీఓ మధుసూదన్ నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేయాలని ఆర్‌డీఎంఏను ఆదేశించారు.

గద్దర్‌కు ఘన నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: ప్రజా యుద్ధనౌక, సాంస్కృతిక విప్లవ కెరటం గద్దర్ చిత్రపటానికి ఎస్ఎస్‌యూఐ నాయకులు గురువారం నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విప్లవగేయాలతో అణగారిన వర్గాలకు దన్నుగా నిలిచారన్నారు. పేద ప్రజల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర వర్సిటీల కన్వీనర్ యనుమల ప్రసాద్, బీసీ సురేష్, ఏఐఎస్ఏ నాయకులు సునీల్, రాజునాయక్, తిరుమలేష్ పాల్గొన్నారు.

పుష్ప కన్వెన్షన్ హాల్ ప్రారంభం



పుష్ప కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: తపోవనం సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన పుష్ప కన్వెన్షన్ హాల్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంతచంద్రారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ హాల్ అధినేత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ విశాలమైన పార్కింగ్‌తో పాటు 600 మంది ఒకేసారి కూర్చునేలా ఏసీ, తదితర సదుపాయాలతో హాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందరికీ అందుబాటు ధరలతో హాల్ ఉంటుందన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఫంక్షన్ హాల్ డైరెక్టర్లు రిషికేష్ రెడ్డి, బెడదూరు కుళ్లాయిరెడ్డి, పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద బీజేపీ ధర్నా

అనంతపురం అర్బన్: గ్రామ స్వరాజ్యాన్ని కాపాడాలని బీజేపీ నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారథి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడారు. 14వ, 15వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులను పంచాయతీలకు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. జనసేన జిల్లా నాయకుడు టీసీవరుణ్, బీజేపీ నాయ కులు చిరంజీవరెడ్డి, లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: రీ సర్వే వేగవంతం చేయాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, పట్టణ ప్రణాళిక కార్యదర్శులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలోని కౌన్సిల్ హాల్‌లో రీ సర్వేపై ఆయన సమావేశం నిర్వహించారు. రీ సర్వేజాప్యంపై సంబంధిత సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 16 ఏ ఫాంలో ప్రతి అసెస్‌మెంట్‌ను సర్వే నంబర్‌కు మ్యాపింగ్ చేయాలన్నారు. పన్ను వేయని స్థలాల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక, అడ్మిన్, వీఆర్‌ఓలు వారి విధులను గురుతర బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ బాలాజీ, టీపీఓ శిరీష, ఆర్‌ఓలు సతీష్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవ ర్యాలీ

రాప్తాడు: మండల పరిధిలోని మాంటిస్సోరి ఎలిట్ పాఠశాల విద్యార్థులు క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ఆంజనేయులు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.